క్లుప్తంగా

రేపు ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బిదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

వేంపల్లె : గ్రామ పంచాయతీల పురోగతికి సిబ్బంది సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ కుళ్లాయమ్మ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాల సభా భవనంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా ప్రజల అవసరాలు, ఆదాయ వనరులను గుర్తించాలన్నారు. తాగునీరు, డ్రైనేజీ, పరిశుభ్రత వంటి అంశాలపట్ల ప్రజలకు నిత్యం అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీ నిధులను ఉపయోగించుకుని పంచాయతీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం శిక్షకులు సిబ్బందికి గ్రామ పంచాయతీల ప్రణాళికపై అవగాహన కల్పించారు.

రికార్డుల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

కొండాపురం : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ రికార్డులను బుధవారం తనిఖీ చేశారు. అనంతరం రేషన్ దుకాణంను తనిఖీ నిర్వహించి పేదలకు రేషన్ సరకులు సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్‌కు సూచించారు. గండికోట జలాశయంలో ముంపునకు గురైన బొమ్మేపల్లెతో పాటు పలు గ్రామాల్లో భూములకు పరిహారం రాని రైతులు సుప్రీం కోర్టును ఐదేళ్ల కిందట ఆశ్రయించారు. వారికి పరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో మండల తహసీల్దార్ గుర్రప్ప, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మల్లికార్జున, ఆర్ఐ మహేశ్వర్‌రెడ్డి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దిద్దేకుంటలో పోలీసుల మేలు కొలుపు

సింహాద్రిపురం : మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన దిద్దేకుంటలో బుధవారం రాత్రి జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప కళజాగృతి ఆధ్వర్యంలో కళాకారులు డ్రామా రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పులివెందుల రూరల్ సీఐ ఎంపీ రమణ, ఎస్ఐ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు చికిత్స

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో పిచ్చికుక్క కాటు గురైన పశువులకు పశువైద్యాధికారులు బుధవారం చికిత్స అందించారు. గ్రామంలో 14 పశువులకు పిచ్చికుక్క కరిచిందని దీంతో పశువులకు రేబిస్ వ్యాధి అంటకుండా టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. పిచ్చికుక్క కాటుకు గురైతే 24 గంటల్లోపు సబ్బుతోగానీ, టింక్చర్‌తోగాని గాయాన్ని శుభ్రం చేయాలని, వర్షంలో తడవకుండా చూడాలని, పిచ్చికుక్క కరిచిన పశువులకు రోజు, 3వ, 7వ, 14వ, 28వ రోజు రేబిస్ టీకాలు వేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు గడించాలి



ద్రవ జీవామృతం తయారీ గురించి అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేంపల్లె : రైతులు ప్రకృతి వ్యవసాయం పాటించి మంచి లాభాలు గడించాలని జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం డీడీఏ సుబ్రమణ్యం, వ్యవసాయశాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం మండలంలోని కుమ్మరాంపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటలో రైతులు తప్పనిసరిగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో రైతులు పొటాష్ వాడటం లేదని, దీంతో పంటలలో రోగాలు అధికంగా పెరిగి దిగుబడి తగ్గుతోందన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు పంటల బీమా, వాతావరణ ఆధారిత బీమాలకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. డ్రోన్ ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. రైతులు ముందుకొస్తే రూ.10 లక్షలు విలువ చేసే డ్రోన్‌ను సబ్సిడీతో రూ.2 లక్షలకు పొందవచ్చునన్నారు. అనంతరం ద్రవ జీవామృతం తయారీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ మునేష్, రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ‘పొలం పిలుస్తోంది’

- రెండు శాఖలు తప్ప.. హాజరు కానీ మిగిలిన శాఖలు
- పంటల సాగులో అవగాహన లేక నష్టపోతున్న రైతులు



తూ తూ మంత్రంగా నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం (ఫైల్)

పులివెందుల రూరల్ : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంటలు సాగులో మెళకువలు, సలహాలు, సూచనలు ఇవ్వడానికి నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమాలు పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా మొక్కుబడిగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి 10 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా.. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల తప్ప మిగిలిన 8 శాఖల అధికారులు హాజరు కావడంలేదు. ఈ రెండు శాఖల అధికారులు కూడా అలా వచ్చి.. ఇలా ఫొటోలు దిగి వెళ్లిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పులివెందుల నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు మండలాల్లో 2024 సంవత్సరం నుంచి ఇప్పటివరకు కేవలం 120 గ్రామాలలో మాత్రమే మొక్కుబడిగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఉన్న సమస్యలను తీర్చి నాణ్యమైన మంచి దిగుబడులు సాధించేలా రైతులను చైతన్యపరిచి సలహాలు ఇచ్చేందుకు రోజుకు రెండు గ్రామాలుచొప్పున ప్రతి వారంలో మొదటి రెండు రోజులు మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించుకోవాల్సింది. అయితే ఈ కార్యక్రమాన్ని అధికారులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులకు క్షేత్రస్థాయికి వెళుతున్నా.. ఆహార వాణిజ్య పండ్లు, పూల తోటలు సాగుకు సంబంధించిన రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే పులివెందుల నియోజవర్గం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు వస్తుండగా, అనుబంధ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకావడంలేదు. వ్యవసాయ శాఖతోపాటు సిరికల్చర్, ఉద్యానవన శాఖ పశుసంవర్ధక శాఖ, పాల డెయిరీ డెవలప్‌మెంట్, కో ఆపరేటివ్ ఫెడరేషన్, మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయ తదితర సుమారు 10 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. వాస్తవానికి ఒకట్రెండు శాఖల అధికారులు మాత్రమే మొక్కుబడిగా వస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల అనుమానాలు తీర్చాల్సి ఉంటుంది. అయితే వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు కార్యక్రమానికి హాజరు కావడం లేదని విమర్శలు వస్తున్నాయి.



రైతులు లేకుండా ద్రవ జీవామృత తయారీని చూపిస్తున్న ఏఓ, సిబ్బంది (ఫైల్)

అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమానికి సంబంధిత అన్ని శాఖల అధికారుల హాజరైతే రైతులకు ఆ శాఖల అధికారులు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ పథకాలు, పంటల సంరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేస్తే బాగుంటుంది. ప్రత్యేక కార్యక్రమాలకు సైతం అధికారులు హాజరుకాకపోవడం మంచి పద్ధతి కాదు. ఇప్పటికైనా పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు వ్యవసాయ శాఖతోపాటు అనుబంధ శాఖల అధికారులుందరూ హాజరు కావాలి.

– సర్వోత్తమరెడ్డి, రైతు, పులివెందుల

అన్ని శాఖల అధికారులకు సమాచారం ఇస్తున్నాం



ప్రతి వారంలో మొదటి రెండు రోజులు మంగళ, బుధవారాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నియోజకవర్గంగా వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులకు హాజరు కావాలని షెడ్యూల్ పంపించాం. అదేవిధంగా ఆయా గ్రామాల రైతులుకు సైతం ముందు రోజే కార్యక్రమంపై సమాచారమిస్తున్నా, కొన్ని గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది. కార్యక్రమానికి సిరికల్చర్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు తప్ప మిగిలిన శాఖల అధికారుల హాజరు కావడం లేదు.

– ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ, పులివెందుల

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, గ్రామ రెవెన్యూ సహాయకులు

చింతకొమ్మదిన్నె : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, గ్రామ రెవెన్యూ సహాయకులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమకు తెలంగాణాతో సమానంగా వేతనాలు పెంచారని, ప్రస్తుతం తెలంగాణాలో ఎక్కువగా జీతాలు ఇస్తున్నారన్నారు. కనీసం రూ.26 వేల జీతాన్ని పెంచాలని, పెన్షన్, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. గతంలో తాము సమ్మెలో పాల్గొన్న సమయంలో టీడీపీ నాయకులు పరామర్శించి తమ ప్రభుత్వం రాగానే భారీగా జీతాలు పెంచుతామని హామీలు ఇచ్చారని, ప్రభుత్వం వచ్చాక పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి మహోత్సవం



ఆలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ

పులివెందుల టౌన్ : గురుపౌర్ణమి మహోత్సవం సందర్భంగా పట్టణంలోని షిర్డిసాయిబాబా ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. పట్టణంలోని స్థానిక పార్నపల్లెరోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో ప్రత్యేకంగా రూపుదిద్దుకోవడంతోపాటు ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. అన్నదానానికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. గురువారం తెల్లవారుజామున బాబా విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించనున్నారు. పెద్దసంఖ్యలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు సాయిబాబాను దర్శించి తరించాలని నిర్వాహకులు కోరారు. ఆలయంలో మరాఠి హారతులు, విశేష పూజాది కార్యక్రమాలతోపాటు భజనలు ఉంటాయన్నారు. అలాగే పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలోని షిర్డిసాయిబాబా ఆలయంలో, సాయికృప లేఅవుట్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో, మార్కెట్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం చేస్తాం



తహసీల్దారు కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న వీఆర్‌ఏలు, అంగన్‌వాడీ వర్కర్లు

చక్రాయపేట : ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని మండలంలోని వీఆర్‌ఏలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సమానపనికి సమాన వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పనివత్తిడి తగ్గించి ప్రభుత్వ పథకాలు వర్తిపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు విజయకుమారికి అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల మండల సంఘం అధ్యక్షుడు పెద్దనారాయణ, గౌర వాధ్యక్షుడు నరసింహులు, ఉపాధ్యక్షులు కృష్ణయ్య, రామచంద్ర, శివప్రసాద్, అంగన్ వాడీల మండల శాఖ అధ్యక్షురాలు సావిత్రి పలువురు అంగన్‌వాడీ సిబ్బంది, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలి



నూతన పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న బీపీసీఎల్ టెర్రిటరీ మేనేజర్ వేణుగోపాల్

వేంపల్లె : మారుతున్న ఆధునిక సాంకేతికతోపాటు వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలని బీపీసీఎల్ టెర్రిటరీ మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. నందిపల్లె గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మిత్రేష్ ఫ్యూయల్స్ పెట్రోల్ బంకును బుధవారం బీపీసీఎల్ టెర్రిటరీ మేనేజర్ ప్రారంభించి మాట్లాడారు. నాణ్యతలో బీపీసీఎల్ ఫ్యూయల్స్ ముందు వరుసలో ఉంటుందని, పెట్రోల్, డీజిల్ కొరకు వచ్చే వాహనదారులకు నాణ్యత గల ఫ్యూయల్స్‌ను మెరుగైన సేవలను అందించి వాహనదారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో బీపీసీఎల్ ఇంజనీర్ కేతన్, సేల్స్ ఆఫీసర్ నరేంద్రకుమార్‌రెడ్డి, డీలర్ అంబకపల్లె జగదీష్, వేంపల్లె, లింగాల మండలాల తహసీల్దార్ హరినాథ్ రెడ్డి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన



ఆర్టీపీపీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

జమ్మలమడుగు : ఏపీ రాష్ట్ర విద్యుత్ జేఏసీ పిలుపులో భాగంగా ఎర్రగుంట్ల మండలం ఆర్టీపీపీలోని ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్టర్లు బుధవారం ఆర్టీపీపీ ప్రధాన గేటువద్ద ఉద్యోగులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం తగదన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథరెడ్డి

వల్లూరు : కనీసం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా ప్రజాస్వామ్యాన్ని చంద్రబాబునాయుడు ఖూనీ చేస్తూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి విమర్శించారు. కడప పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఒక రాజకీయ పార్టీ స్వేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహించుకోలేని దురదృష్టకర పరిస్థితులు ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. మే నెల నుంచి మామిడి రైతులు, అంతకు ముందు దాన్యం రైతులు, మిర్చి రైతులు, పొగాకు రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతూ అష్ట కష్టాలు పడుతున్నా మొద్దు నిద్రలో వున్న ఈ ప్రభుత్వం దున్నపోతు మీద వానపడ్డ మాదిరిగా పట్టించుకోవడంలేదని తీవ్రంగా విమర్శించారు. మంత్రులు, ముఖ్యమంత్రి పట్టించుకోకుంటే ఇక అధికారులు ఏం చేస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోనీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజలకు, రైతులకు అండగా నిలుద్దామనుకునే వారికి ప్రభుత్వం ఆ అవకాశం ఇవ్వకుండా నియంతలా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో కష్టాల్లో వున్న ప్రజలను, ముఖ్యంగా రైతులను పరామర్శించడానికి కూడా అవకాశంలేని దౌర్భాగ్యపు పరిస్థితులు నెలకొనడం సిగ్గుచేటన్నారు. చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యంలో శాంతియుతంగా వున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పోలీసులు లాఠీచార్జ్ చేయడం అత్యంత దారుణమని, దీన్ని ఖండిస్తున్నామని అన్నారు. గత వారం రోజులుగా చంద్రబాబు ప్రభుత్వం, పోలీసులు జగన్ పర్యటనలపై ఉద్దేశ పూర్వకంగా కృత్రిమ వివాదాలు సృష్టిస్తూ ఎక్కడికక్కడ రైతులను, పార్టీ కార్యకర్తలను బెదిరించడం నోటీసులు జారీ చేయడం వంటి పనుల ద్వారా ఒక భయోత్పాతాన్ని సృష్టించడానికి ప్రయత్నించారన్నారు. సొంత పార్టీ పెట్టిన తరువాత జగన్ ఏ కార్యక్రమం చేపట్టినా హింసకు దూరంగా, శాంతియుతంగా నిర్వహించిన చరిత్ర అందరికీ తెలుసన్నారు. ఎల్లో మీడియాతో వైఎస్సార్‌సీపీపై బురద జల్లడం ఒక పనిగా మారిపోయిందన్నారు. ప్రజలు, రైతులు ఎంత కష్టాల్లో వున్నా పట్టించుకోని ఈ ప్రభుత్వం తమ వైఫల్యాలను ఏ ఒక్కరూ ఎత్తిచూపడానికి కూడా భయపడాలనే దురాలోచనతో వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలూ లేవని, చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తే మా నాయకుడు తిరగాల్సిన అవసరం వుండేది కాదన్నారు. రైతులను ఆదుకోవడం మరిచి, వారిని రౌడీలుగా సంభోదించడం దారుణమన్నారు. దురాలోచనలతో మీరు ఎంత కట్టడి చేసినా ప్రజల్లో అంత స్పందన ఎందుకు వస్తోందో బంగారుపాళ్యంకు అన్నివేల మంది ప్రజలు ఎందుకు వచ్చారో, ప్రజల్లో ఎంత వ్యతిరేకత వుందో ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారన్నారు. రైతులను తీవ్ర నష్టాలకు గురిచేసిన చంద్రబాబు ప్రభుత్వం తన తప్పును సరిదిద్దుకుని, రైతులపై చేసిన లాఠీఛార్జికి క్షమాపణలు చెప్పాలని లేకుంటే ప్రజాగ్రహాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న ఏఓ ఓబులేసు

వేముల : పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ ఓబులేసు రైతులకు సూచించారు. మండలంలోని వి.కొత్తపల్లె, అమ్మయ్యగారిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు ఎక్కువగా పచ్చదోమ, తెల్లదోమ ఆశిస్తుందన్నారు. ముఖ్యంగా కోత దశలో ఉన్న పంటకు పచ్చ, తెల్ల దోమల ఉదృతి ఎక్కువగా ఉన్నట్లయితే పూత రాలిపోయే ప్రమాదం ఉందని, రైతులు ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. అధిక మోతాదులో ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. ముఖ్యంగా పంట సాగు చేసే రైతులు భూసార పరీక్షలను అనుసరించి రసాయన ఎరువులను వాడాలన్నారు. అనంతరం ఫసల్ బీమా గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, రైతులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి

జమ్మలమడుగు : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న సాయిబాబా దేవాలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ముగిసిన మస్తాన్‌స్వామి పీరు ఉత్సవం



గ్రామోత్సవంలో మస్తాను పీరు ఉత్సవం

పులివెందుల టౌన్ : పట్టణంలో అత్యంత పేరుగాంచిన మస్తాన్‌స్వామి పీరు ఉత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. మస్తానుస్వామి పీరును జెండామాను వీధిలోని పీర్ల చావిడి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. మస్తాను పీరు తమ ఇంటికి ముందుకు రాగానే భక్తులు చెక్కర చదివింపులు ఇచ్చాక అందరికి పంచిపెట్టారు. కొంతమంది భక్తులు వెండిగొడుగులు చేయించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గురువారం నుంచి స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఉన్న భవాణి పీరు ఉత్సవం మొదలు కానుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు. అగ్నిగుండ ప్రవేశానికి అగ్నిగుండం తవ్వారు. పీర్ల చావిడిలో పీర్లను కొలువుతీర్చారు.

లింగాల : దిగువలింగాల గ్రామంలో మొహర్రం పండుగ సందర్భంగా చిన్న పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కొత్త మస్తాన్‌స్వామి, పాత మస్తాన్‌స్వామి, మౌలాలి స్వామి పీర్లను వందలాది మంది భక్తుల మధ్య ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సాయంత్రం నుంచి ఊరేగింపు కార్యక్రమం నిరంతరాయంగా సాగింది. డప్పు వాయిద్యాల మధ్య డీజే పాటలకు యువకులు చిందులేస్తూ ఉత్సాహంగా ఉల్లాసంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురంలో బుధవారం మస్తాన్‌స్వామి పీరు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడి వద్దకు గ్రామస్తులు పానకాలను తీసుకునివచ్చి ముజావర్లచే చెక్కెర చదివింపులు చేశారు. సాయంత్రం మస్తాన్‌స్వామిని గ్రామస్తులు అగ్నిగుండంలో ప్రవేశించి గ్రామోత్సవంగా తరలివెళ్లారు.

వేంపల్లె : మండలంలోని పాములూరు గ్రామంలో మస్తాన్‌స్వామి, మాబుస్వామి పీర్లను ఊరేగించారు. బుధవారం పీర్లను గ్రామ పురవీధుల గుండా భక్తి శ్రద్ధలతో పూజించి గ్రామోత్సవం చేశారు. చుట్టూ గ్రామాల ప్రజలు గ్రామోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు చెక్కెర చదివింపులు ఇచ్చి అనంతరం పంపిణీ చేశారు.

లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలి



పులివెందులలో ఆర్డీఓ చిన్నయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

పులివెందుల టౌన్ : కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు గఫూర్, ఏఐటీయూసీ నాయకులు వెంకటరాములు తెలిపారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక మినీ సెక్రటేరియట్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న ఆర్డీఓ చిన్నయ్యకు వారు మెమరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గత 11 ఏళ్లల్లో కార్మిక చట్టాలను నీరు గార్చిందన్నారు. సులభతర వాణిజ్యం నెపంతో కార్మికులకు వ్యతిరేకంగా నాటి చట్టాలను మార్పులకు చర్యలు ఆచరిస్తున్నారన్నారు. రవాణా శాఖ సవరణ చట్టంలో వాహనం ప్రమాదానికి గురైతే డ్రైవర్లకు 10 ఏళ్ల జైలుశిక్ష, లైసెన్స్ రద్దు లాంటి తీవ్రమైన చర్యలకు గురిచేసే విధానాలకు రూపకల్పన చేశారని.. వీటిని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికుల సమ్మె హక్కును హరిస్తూ 10 గంటలు పనికి పెంచారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఎలక్ట్రిల్ యూనియన్ నాయకులు, ముస్లిం ఐక్య వేదిక కార్మిక విభాగం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : కార్మికుల హక్కులను కాలరాస్తే నాలుగు లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ తెలిపారు. బుధవారం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కమలాపురంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఐసీడీఎస్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు రాణి, చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గత 11 ఏళ్లలో కార్మిక చట్టాలను నీరు గార్చారన్నారు. కార్యక్రమంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలు తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్షుడు ఏసుదాసు, కార్యదర్శి దాసరి విజయ్‌లు మాట్లాడారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రసాద్, లక్ష్మీనారాయణలు ఆర్డీఓ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎల్ఐసీ లియాఫీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం బ్రాంచ్ అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేంపల్లెలో..

వేంపల్లె : కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేసి కనీస వేతనం రూ.26 వేలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బళ్లారపు రామాంజనేయులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం వేంపల్లి నాలుగు రోడ్ల కూడలిలో, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసనలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రహంతుల్లాఖాన్, అంగన్‌వాడీ వర్కర్ యూనియన్ నాయకురాలు సరస్వతి, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం : కేంద్ర ప్రభుత్వం కార్మికుల చట్టాలను హరిస్తున్నదని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. శివనారాయణ తెలిపారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మైలవరంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సుప్రీకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెద్దకర్మ



మా తండ్రి గారు
కీ॥శే॥ శ్రీ సగిలి వీరారెడ్డి గారు
22-06-2025 వ తేది ఆదివారం తెల్లవారుజామున స్వర్గస్తులైనారు. వారి పెద్దకర్మ 10-07-2025 వ తేది గురువారం ఉదయం గం॥ 11-30 ని॥లకు మా స్వగృహము డోర్ నెం. 6/41, సగిలివారి వీధి, చెన్నూరు, కడప నందు జరుగును. కావున తెలియజేయడమైనది.
మీ చెరగని చిరునవ్వు మా మనస్సులో చిరస్థాయిగా నిలిచినా
మీ మరణం మాకు తీరనిలోటు మీ మధుర స్మృతులు, జ్ఞాపకాలు
మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ....
భార్య : సగిలి సులోచనమ్మ
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు
సెల్ : 7386098363, 9440872481